

కనుల పండువగా కల్యాణోత్సవం

ఆమనగల్లులోని వేంకటేశ్వరాలయంలో అలివేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకలు కనుల పండువగా జరిగాయి. 8లో▸



'వంట' మంట

మంచాల మండల పరిధిలో 44 ప్రభుత్వ పాఠశాలలుండగా విద్యార్థులు లేక నాలుగు పాఠశాలలు మూతపడ్డాయి. 8లో▸



వలస కార్మికులకు విముక్తి

ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఒడిశా కార్మికులకు అధికారులు విముక్తి కల్పించారు. వారివారి స్వస్థలాలకు పంపించారు. 8లో▸

పహాడీలో పండ్ల మార్కెట్



కొనసాగుతున్న షెడ్ల నిర్మాణ పనులు

బాట సింగారానికి ప్రత్యామ్నాయంగా..

- 12 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూమిలో ఏర్పాటు
- చురుగ్గా కొనసాగుతున్న నిర్మాణ పనులు
- రంజాన్‌లోపు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు

పహాడీషరీఫ్: శ్రీశైలం ప్రధాన రహదారిపై ఉన్న పహాడీషరీఫ్‌లో త్వరలో నూతన పండ్ల మార్కెట్ కొలువుదీరనుంది. కోహెడ మార్కెట్ ఇంకా ప్రారంభం కాకపోవడం.. బాటసింగారంలో ఏర్పాటు చేసిన మార్కెట్ వ్యాపారులకు దూరంగా ఉండడంతో పహాడీషరీఫ్‌లో ప్రత్యామ్నాయ హోల్‌సేల్ మార్కెట్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ఈ మేరకు నిర్మాణ పనులు సైతం చురుగ్గా కొనసాగుతున్నాయి. త్వరలోనే మార్కెట్ అందుబాటులోకి రానుంది.

వడివడిగా పనులు

పహాడీషరీఫ్‌లో పండ్ల మార్కెట్ ఏర్పాటు విషయమై మజ్లిస్ పార్టీ శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అసెంబ్లీలో ప్రస్తావించారు. ఈ క్రమంలోనే ఆరు నెలల క్రితం మంత్రులు మహమూద్ అలీ, సబితారెడ్డి, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న వక్ఫ్‌బోర్డు స్థలాన్ని పరిశీలించారు. ఆర్‌సీఐ ప్రహరీని ఆనుకొని ఉన్న 12 ఎకరాల్లో మార్కెట్ ఏర్పాటుకు అధికారులు నిర్ణయించారు. చెట్లు, పొదలు, గట్లతో కూడిన ఈ భూమిలో నెల రోజులుగా జేసీబీలు, ప్రొక్లెయినర్లతో చదునుచేసే పనులు ప్రారంభమయ్యాయి. షెడ్ల నిర్మాణం సైతం కొనసాగుతోంది.

త్వరలో ప్రారంభం

మామిడికాయల సీజన్ ప్రారంభం అవుతుండడాన్ని దృష్టిలో ఉంచుకొని త్వరలో ఈ మార్కెట్‌ను ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రధానంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి నుంచి ఈ మార్కెట్‌కు పండ్లు దిగుమతి కానున్నాయి. రంజాన్ మాసంలో పండ్ల అవసరం కూడా పెద్ద ఎత్తున ఉండడంతో ముస్లిం వ్యాపారులు ఇబ్బందులు పడకుండా ఆలోపే మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేలా ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ పలు దఫాలుగా మార్కెట్ కమిటీ అధికారులతో సమావేశమవుతూ వస్తున్నారు.



స్థలాన్ని చదును చేస్తున్న జేసీబీలు

ఉపాధి అవకాశాలు



జల్‌పల్లి మున్సిపాలిటీలోని పహాడీషరీఫ్‌లో ఏర్పాటవుతున్న ఈ పండ్ల మార్కెట్‌తో స్థానికులకు ఎన్నో రకాల ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. బాట సింగారంలోని మార్కెట్‌కు వెళ్లి పండ్లు కొనుగోలు చేసేందుకు చిరు వ్యాపారులకు రవాణా ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ప్రభుత్వంతో చర్చించి ఇక్కడ మార్కెట్ ఏర్పాటుకు చొరవ తీసుకున్నారు. విశాలమైన స్థలంలో ఏర్పాటవుతున్నందున ఈ మార్కెట్‌కు పార్కింగ్ సమస్య కూడా తలెత్తదు.

– అబ్దుల్లా సాది, జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్

న్యూస్‌రీల్

ఎస్సీ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

తుక్కుగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో 'తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఫర్ నర్సస్' ఆధ్వర్యంలో 18 ఏళ్ల నుంచి 35 సంవత్సరాల వరకు ఉన్న ఎస్సీ యువతీయువకులు, విద్యార్థులకు ఉచిత శిక్షణ వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్హతతో జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ఫార్మసీ అసిస్టెంట్, డెంటల్ అసిస్టెంట్ ఇంటర్ విద్యతో డయాలసిస్ టెక్నీషియన్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 98485 81100, 90599 02355 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మహిళలు, పిల్లల పోషణకు సహకారం

తుమ్మలూరు అంగన్‌వాడీని సందర్శించిన యూనిసెఫ్ బృందం



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తున్న యూనిసెఫ్ బృందం

మహేశ్వరం: మండల పరిధిలోని తుమ్మలూరు అంగన్‌వాడీ కేంద్రం–1ని మంగళవారం యూనిసెఫ్ బృందం సందర్శించింది. రాష్ట్రంలో యూనిసెఫ్ సహకారంతో పిల్లలు, తల్లుల సంక్షేమం కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాల అమలు తీరును అంగన్‌వాడీ టీచర్, తల్లులు, బాలింతలు, కిశోర బాలికలను అడిగి తెలుసుకున్నారు. బరువు, ఎత్తు ఎలా కొలుస్తారో పర్యవేక్షించారు. అనంతరం పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. మహిళలు, గర్భిణులు, తల్లులు, బాలింతలు, పిల్లల పోషణకు యూనిసెఫ్ నిరంతరం సహకారం అందిస్తుందని బృందం సభ్యులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనిసెఫ్ బృందం సభ్యులు రిచర్డ్ బ్రైటాన్, రాఘవ్ అరోరా, రాహుల్ బాన్సన్, జాన్‌స్పార్క్స్, మోహిని, డానియల్, ఖ్యాతి తివారీ, మహేశ్వరం ఐసీడీసీ సీడీపీఓ షబానా, తుమ్మలూరు సర్పంచ్ మద్ది సురేఖారెడ్డి, ఉప సర్పంచ్ కటికల శ్రీహరి ముదిరాజ్, మాజీ సర్పంచ్ మద్ది కరుణాకర్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన యూనిసెఫ్ బృందం



సాయిరెడ్డిగూడ పాఠశాలను సందర్శించిన యూనిసెఫ్ ప్రతినిధులు తదితరులు

కందుకూరు: మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలను మంగళవారం యూనిసెఫ్, సీఈఈ, ఎస్ఎస్ఏ బృందం సందర్శించింది. యూకే యూనిలీవర్ సంస్థతో కలిసి గతంలో దేశంలో పాఠశాలల పరిస్థితి, స్వచ్ఛతపై చేపట్టాల్సిన అంశాలను సర్వే చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఆ తర్వాత పాఠశాలల్లో వారు సూచించిన పనులు చేపట్టారు. అందులో భాగంగా సాయిరెడ్డిగూడ పాఠశాలను తనిఖీ చేసి పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, ఉపయోగం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం, పేరెంట్స్ కమిటీ పని తీరు, చైల్డ్ కమిటీ పని తీరు, స్వచ్ఛత యాక్షన్ ప్లాన్ (ఎస్ఏపీ), ఉపాధ్యాయుల పని తీరు తదితరాలను పరిశీలించి మెరుగుపర్చుకోవాల్సిన అంశాలతో పాటు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఈఓ సుశీందర్‌రావు, యూనిసెఫ్ యూకే, హైదరాబాద్ టీమ్ సభ్యులు అర్లికట్టి వెంకటేశ్, ప్రభాత్, డాక్టర్ వెంకటేశం, సీఈఈ బెంగుళూరు రీజనల్ కోఆర్డినేటర్ రిజినా, తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.ఉదయ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ బద్దెల, సర్పంచ్ మహేశ్, ఎంపీటీసీ ఇందిర, ప్రధానోపాధ్యాయుడు నాగరత్నం, ఎస్ఎంసీ చైర్మన్ ఇందిరమ్మ, పంచాయతీ కార్యదర్శి పంతునాయక్ పాల్గొన్నారు.

పరిశోధన సంచాలకులుగా వెంకటరమణ

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాకులుగా ఎం.వెంకటరమణను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పరిశోధన సంచాకులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జగదీశ్వర్ పదవీ విరమణ చేయడంతో నూతన పరిశోధన సంచాకులకు వెంకటరమణను నియమించారు.

స్నేహితుడు మోసం చేశాడని..

డీఆర్‌డీఓ సైంటిస్టు ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రాణస్నేహితుడని నమ్మితే నిండా ముంచడంతో మనోవేదనకు గురైన ఓ సైంటిస్టు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వనం రమేశ్ నాదర్‌గుల్‌లోని లింబ్రా ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్నాడు. హైదరాబాద్ డీఆర్‌డీఓలో సైంటిస్టుగా పనిచేస్తున్నాడు. వనం రమేశ్, రవికుమార్ స్నేహితులు. రవిని బాగా నమ్మిన రమేశ్ ఏదడిగినా కాదనేవాడు కాదు. దీన్ని ఆసరాగా చేసుకున్న రవికుమార్.. తాను వ్యాపారం చేయడానికి పెట్టుబడిగా రమేశ్ నుంచి రూ.20 లక్షలు తీసుకున్నాడు. తర్వాత ఈఎంఐ తానే చెల్లిస్తానని చెప్పి రమేశ్ ఇంటిపై రూ.80 లక్షలు రుణం తీసుకున్నాడు. అనంతరం ఈఎంఐ చెల్లించడం మానేశాడు. చివరకు ఇంటిని రిజిస్ట్రేషన్ చేస్తే తానే ఈఎంఐ చెల్లిస్తానని చెప్పడంతో రవికుమార్ పేరిట ఇల్లు కూడా రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే.. రోజురోజుకూ అప్పులు పెరగడం.. ఈఎంఐలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. చివరకు ఇల్లు తనదని, ఖాళీ చేయమని రవికుమార్ హెచ్చరించడం ప్రారంభించాడు. అయినా రమేశ్ పట్టించుకోకపోవడంతో అఫ్జల్ అనే వ్యక్తి పేరు మీద ఇంటిని రిజిస్ట్రేషన్ చేశాడు. ఇంట్లో నుంచి వెళ్లకపోవడంతో నోటీసులు పంపాడు. నా ఇంటికి నోటీసులు పంపడం ఏమిటని తీవ్ర మనోవేదనకు గురైై వనం రమేశ్ (38).. మంగళవారం ఇంట్లో ఉరి వేసుకొనిఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శిరీష పోలీసులకు ఫిర్యాదు చేసింది. రమేష్‌కి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదిబట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వారసత్వ కట్టడాలను కాపాడుకుందాం

- హెచ్ఎండీఏ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్



వీఎంహోంను సందర్శించి మరమ్మతు పనులను పరిశీలిస్తున్న అరవింద్‌కుమార్

హుడాకాంప్లెక్స్: పురాతన వారసత్వ కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని హెచ్ఎండీఏ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ అన్నారు. సరూర్‌నగర్ మండల కేంద్రంలోని విక్టోరియా మెమోరియల్ హోం పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి రూ.4 కోట్ల నిధులతో చేపట్టిన భవన మరమ్మతు పనులను పరిశీలించారు. వేలాది మంది అనాథ బాలలకు ఆశ్రయం కల్పిస్తున్న హోంకు 120 సంవత్సరాల చరిత్ర ఉందని, 67 ఎకరాల సువిశాలమైన స్థలంలో ఏర్పాటైన హోం కట్టడాలను కాపాడుకుందామని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ క్యాస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కమిషనర్ యోగితారాణి, వీఎంహోం కార్యదర్శి అఖిలేష్‌రెడ్డి, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, సరూర్‌నగర్ సర్కిల్ డీసీ కృష్ణయ్య, ప్రిన్సిపాల్ ప్రభుదాస్, సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి, వైస్ ప్రిన్సిపాల్ మాధురి, శివప్రసాద్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలు కలిగి ఉండాలి



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

- హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

మీర్‌పేట: విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలు కలిగి ఉండి సమాజంలో మూఢనమ్మకాలపై అప్రమత్తంగా ఉండాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. సైన్స్‌డే సందర్భంగా జనవిజ్ఞాన వేదిక బాలాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మీర్‌పేటలోని చల్లా లింగారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సదస్సుకు చంద్రకుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మూఢనమ్మకాల గుట్టువిప్పి ప్రజలకు అవగాహన కల్పించాలని, సమాజంపై క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా ఉండి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సర్ సీవీ రామన్, ఇతర శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకుని నూతన అన్వేషణలు చేస్తూ సమాజం ప్రగతి వైపు నడిచేలా చూడాలని పిలుపునిచ్చారు. సమతా నాలెడ్జ్ సెంటర్ నిర్వాహకుడు జి.రాజేశ్వరరావు మాట్లాడుతూ.. సృజనాత్మకంగా ఆలోచించడం నేర్చుకోవాలని, బట్టీ చదువు కాకుండా అర్థం చేసుకున్నప్పుడే చదువుల్లో రాణించవచ్చని విద్యార్థులకు సూచించారు. అనంతరం జస్టిస్ చంద్రకుమార్ స్వయంగా రచించిన పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సాయిబాబా, మండల ప్రధాన కార్యదర్శి టీవీజీకే రాజు, విశ్రాంత శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు, వేదిక నాయకులు కిషోర్ సైన్స్ ఉపాధ్యాయులు జి.శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

షాద్‌నగర్: వైద్య విద్యార్థిని మృతి ఘటన కేసును వేగంగా విచారించేందుకు ప్రభుత్వం వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్ భూతానికి ఎంతో మంది విద్యార్థులు బలైపోతున్నా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని అన్నారు. విద్యార్థుల్లో పరివర్తన రావడం కోసం ప్రభుత్వం ఆ దిశగా ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. సీనియర్ విద్యార్థి వేధింపులకు గురి చేస్తున్నాడని వైద్య విద్యార్థిని ప్రీతి కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ఫలితంగా ఆమె మృతి చెందిందని అన్నారు. ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీను, బుద్దుల జంగయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలి

షాద్‌నగర్‌రూరల్: ఇళ్ల స్థలాల పట్టాలిచ్చిన నిరుపేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ జిల్లా క్యాదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని జిల్లేడ్‌చౌదరిగూడ, కొందుర్గు మండలాలలో గతంలో ఇళ్ల స్థలాలు తీసుకున్న పేదలకు డబుల్ బెడ్ రూం నిర్మించి ఇవ్వాలని కోరుతూ మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. కొందుర్గులో 74 మందికి, జిల్లేడ్‌చౌదరిగూడలో 41మందికి ఇళ్ల స్థలాల పట్టాలను సాధించుకోవడం జరిగిందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీను, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాల్మాకుల జంగయ్య

బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడుదాం

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాధవి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడుదామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాధవి పిలుపునిచ్చారు. పట్టణంలోని న్యూసిటీ కాలనీలో బీజేపీ నేత శ్రీనివాస్‌చారి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రజా గోస.. బీజేపీ భరోసా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న బీఆర్‌ఎస్ నేతలు ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. తెలంగాణలో రాచరిక పాలన కొనసాగుతోందని, ఈ పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించకుండా సీఎం కేసీఆర్ తన కుటుంబంలో ఉన్న వారందరికీ ఉద్యోగాలు ఇచ్చాడని ఆమె ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పుడు ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ సీఎం కేసీఆర్ హయాంలో అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. ఇలాంటి పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి ఒకసారి అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, దేపల్లి అశోక్‌గౌడ్, అందెబాబయ్య, కృష్ణారెడ్డి, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, వంశీకృష్ణ, మనోహర్‌రెడ్డి, మల్చలం మురళి, ప్యాట అశోక్, దొడల వెంకటేశ్, చెట్ల వెంకటేశ్, అంజయ్య, నర్సింలు, శ్రీనివాస్‌చారి, లక్ష్మీకాంత్‌రెడ్డి, బోయ కుర్మయ్య, సుధాకరప్ప, తదితరులు పాల్గొన్నారు.

కుక్కలున్నాయి జాగ్రత్త!

బెడదను అరికడదాం.. దాడులను నిలువరిద్దాం

- కుక్కకాటు ఘటనలు పునరావృతం కానివ్వకుండా చూస్తాం
- ఇందుకోసం ప్రత్యేకంగా కమిటీ వేస్తాం
- అంబర్‌పేట కుక్కకాటు బాధిత బాలుడి కుటుంబానికి పరిహారం
- కార్పొరేటర్లు, స్వచ్ఛంద సంస్థలతో మేయర్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

సాక్షి,సిటీబ్యూరో: వీధికుక్కల బారి నుంచి ప్రజలను కాపాడేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, జంతు ప్రేమికులు ముందుకు రావాలని మేయర్ విజయలక్ష్మి కోరారు. కుక్కల బెడద నివారణపై జీహెచ్ఎంసీలో ఒక్కో పార్టీ నుంచి ముగ్గురు కార్పొరేటర్లతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వెటర్నరీ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వీధి కుక్కల నివారణకు శానిటేషన్ వర్కర్ల నుంచి ఏఎంఓహెచ్‌లు, డీసీలు, కార్పొరేటర్ల వరకు అందరికీ బాధ్యత ఉంటుందన్నారు. కుక్కకాటు ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేకంగా అఖిలపక్ష కమిటీ వేస్తామని, ఆయా పార్టీల నుంచి ఇద్దరేసి పేర్లు ఇవ్వాలని సూచించారు.

బాలుడి కుటుంబానికి పరిహారం..

ఇటీవల అంబర్‌పేటలో కుక్కల దాడిలో మృతిచెందిన బాలుని కుటుంబానికి మేయర్ అధికారం మేరకు రూ.2 లక్షలతో పాటు తనకు వచ్చే నెల గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు మేయర్ తెలిపారు. డిప్యూటీ మేయర్‌తో పాటు సమావేశానికి హాజరైన 17 మంది కార్పొరేటర్లు తమ ఒక నెల గౌరవ వేతనం ఇస్తామని తీర్మానించారు. జీహెచ్ఎంసీ తరఫున రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయనున్నట్లు మేయర్ తెలిపారు. దీంతో పాటు ప్రభుత్వానికి నివేదిక పంపి బాధిత కుటుంబానికి తగిన సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

స్టెరిలైజేషన్లు పెంచుతాం..

ప్రస్తుతం రోజుకు జరుగుతున్న 150 స్టెరిలైజేషన్లను ఆధునిక పరిజ్ఞానంతో 450కి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చెత్త సమస్యలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ అంశంలో నిర్లక్ష్యం కనబరిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్పొరేటర్ల డిమాండ్లపై స్పందిస్తూ కుక్కలను పట్టుకునేందుకు వెళ్లినప్పుడు స్థానిక కార్పొరేటర్ సంతకంతో ధ్రువీకరణ పొందాలన్నారు. కార్పొరేటర్లకు తెలియకుండా కుక్కల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని రద్దు చేయరాదన్నారు.

మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

రేబిస్ సోకకుండా కుక్కలకు టీకాలు, స్టెరిలైజేషన్ కార్యక్రమాలపై మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తామని కమిషనర్ లోకేశ్‌కుమార్ తెలిపారు. యానిమల్ కేర్ సెంటర్లను సందర్శించి కల్పించాల్సిన సదుపాయాలు తెలియజేయాల్సిందిగా కార్పొరేటర్లను కోరారు. ఇకపై యేటా కుక్కల గణన చేస్తామని తెలిపారు. మటన్, చికెన్ షాపుల వ్యర్థాలు బహిరంగంగా వేయకుండా కవర్లను అందజేస్తామన్నారు. కుక్కలతో పాటు కోతుల బెడద తగ్గించేందుకు పశువులను గోశాలలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వీధికుక్కలను పెంచుకోవడానికి ముందుకు వచ్చినవారికి ఫ్రీ లైసెన్సు, రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. వాటికి అవసరమైన చికిత్సను త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వాలి..

సమావేశానికి హాజరైన ఆయా పార్టీల కార్పొరేటర్లు మాట్లాడుతూ.. ఎన్జీఓల సమన్వయంతో వీధికుక్కల బెడద సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, క్షేత్రస్థాయిలో వెటర్నరీ అధికారులను పెంచాలన్నారు. స్టెరిలైజేషన్ల కోసం కుక్కలను పట్టుకునేటప్పుడు స్థానిక కార్పొరేటర్లకు తెలియజేయాలని, కుక్క కరిచినప్పుడు సమీప అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రేబిస్ నిరోధక ఇంజెక్షన్లు లభించేలా తగిన చర్యలు తీసుకోవడంతోపాటు దాని గురించి ప్రచారం చేయాలని కోరారు. మరణించిన బాలుని కుటుంబానికి ఆర్థిక సహాయంతోపాటు ఒకరికి ఉద్యోగం కల్పించాలని, డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వాలని కోరారు. కుక్కలకు స్టెరిలైజేషన్, యాంటీ ర్యాబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాలు కాగితాల్లో లెక్కలకు, వాస్తవానికి పొంతన లేదని దృష్టికి తెచ్చారు.

3 నెలల పాటు వీధికుక్కల స్పెషల్ డ్రైవ్

వీధికుక్కలపై వెల్లువెత్తుతున్న విమర్శలతో మూడు నెలలపాటు వాటిని పట్టుకునే స్పెషల్‌డ్రైవ్‌కు సిద్ధమైన అధికారులు అద్దె వాహనాలు తీసుకోనున్నారు. ఇప్పటికే సర్కిల్‌కు ఒకటి చొప్పున ఉన్న 30 వాహనాలకు తోడు అదనంగా 20 వాహనాలను తీసుకోనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఇందుకుగాను రూ. 1.18 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ వాహనాల్లో వీధికుక్కలెక్కువగా ఉన్న చార్మినార్, సికింద్రాబాద్ జోన్లలో నాలుగేసి వాహనాలను, ఎల్‌బీనగర్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్లలో మూడేసి వాహనాలను వినియోగించనున్నట్లు తెలిపారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

వేంకటేశ్వరుడిని దర్శించుకున్న భక్తజనం

కడ్తాల్: ఆమనగల్లు పట్టణంలోని వేంకటేశ్వరాలయంలో మంగళవారం అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తల్లోజు ఆచారి, గీత, రాము శ్వేత, జూలూరి రమేశ్‌బాబు, రామేశ్వరి, దేవేందర్ శెట్టి, వంశీకృష్ణ, శశిరేఖ, లక్ష్మీనారాయణ, శ్యాంసుందర్, వాసు, మంజుల, పాండయ్య, శారద, ఏకనాథం దమయంతి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుకు కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బిక్కుమాండ్ల యాదయ్య, పాండయ్య, రామకృష్ణ, నర్సింహ, పాపిశెట్టి రాము, నటరాజ్‌యాదయ్య, తల్లోజు గీత, డాక్టర్ వాసు, నయనాచారి. దేవేందర్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు


హాజరైన భక్తులు

పేదలకు పట్టాలు ఇప్పించండి


ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్ల: పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య కోరారు. మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యతో పాటు పార్టీ నాయకులు ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిశారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని పోరాడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. మహిళలు పోరాడుతున్నా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ఎలాంటి ఆటంకాలు సృష్టించినా పేదలకు పట్టాలిచ్చే వరకు అండగా ఉంటామని చెప్పారు. ఎమ్మెల్యేగా పట్టాలిప్పించేందుకు కృషి చేయాలని కాలె యాదయ్యను కోరారు.

వ్యక్తి బలవన్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సురేశ్ తెలిపిన ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్‌లో నివాసం ఉండే బండ అయిలయ్య(32) భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి జీవించేవాడు. అశోక్ లేలాండ్ మినీ వ్యాన్‌తో బియ్యం సరఫరా చేస్తుంటాడు. ఇరవై రోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో 15 రోజుల క్రితం భార్య పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పాఠశాలకు వెళ్లి వచ్చిన కూతురు తలుపులు నెట్టడంతో అయిలయ్య ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే ఆమె విషయం చుట్టు పక్కలవాళ్లకు చెప్పింది. గతంలోనూ అయిలయ్య ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీ కొన్న బైక్

యువకుడి మృతి

హయత్‌నగర్: రోడ్డు పక్కన ఆగి ఉన్న టిప్పర్‌ను బైక్ ఢీ కొట్టడంతో బైక్‌పై వెళుతున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్ శివసాయి కాలనీకి చెందిన ఠాకూర్ అనీల్‌కుమార్ రాయ్ కొడుకు ఠాకూర్ అనుదీప్ సింగ్(21) ఉప్పల్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మంగళవారం తన పని ముగించుకుని బైక్‌పై తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో కుంట్లూర్ జాన్సన్ స్కూలు వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న టిప్పర్‌ను వేగంగా వచ్చిన ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో అనుదీప్ సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

5న ధ్యాన ఫౌండేషన్ పంచమ వార్షికోత్సవం

హుడాకాంప్లెక్స్: ధ్యాన ఫౌండేషన్ ఆధ్యాత్మిక యోగా ప్రచార సంస్థ ఆధ్వర్యంలో ఐదేళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రఘుగురూజీ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సభ్యులకు ఆన్‌లైన్ ద్వారా యోగా శిక్షణ ఉచితంగా అందిస్తున్నామన్నారు. సంస్థ పంచమ వార్షికోత్సవాలను హైదరాబాద్ చంపాపేటలోని మంద యాదవరెడ్డి గార్డెన్స్‌లో మార్చి 5న నిర్వహించబోతున్నామని వివరించారు. ఈ వార్షికోత్సవానికి మంత్రి సబితారెడ్డిని మంగళవారం ఆహ్వానించామని చెప్పారు.


మంత్రి సబితారెడ్డిని ఆహ్వానిస్తున్న యోగా గురూజీలు

దావత్‌కు వెళ్లి వస్తుండగా..

వాహనం ఢీకొనడంతో ఇద్దరు స్నేహితుల మృతి


గణేశ్ (ఫైల్)


శివశంకర్‌నాయక్ (ఫైల్)

చేవెళ్ల: దావత్‌కు వెళ్లి తిరిగి వస్తున్న ఇద్దరు స్నేహితులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీరి బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలూరు సమీపంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా ధారూరు మండలం గురుదుట్ల గ్రామం ఉరేంటి తండాకు చెందిన నేనావాత్ గణేశ్ (24), అదే గ్రామానికి చెందిన శివశంకర్ నాయక్(20) స్నేహితులు. డిగ్రీ వరకు చదువుకున్న వీరు.. క్యాటరింగ్ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటున్నారు. సోమవారం పూడూరు మండల పరిధిలోని తిర్మాలాపూర్ తండాలో స్నేహితుడి ఇంట్లో దావత్ ఉందని వీరిద్దరు బైక్‌పై వచ్చారు. అనంతరం అర్ధరాత్రి తిరుగు ప్రయాణం అయ్యారు. వారితో పాటు ఉన్న మరో స్నేహితుడు ప్రదీప్ మన్నెగూడలో దిగాడు. అయితే గణేశ్, శివశంకర్ బైక్‌పై మళ్లీ చేవెళ్ల వైపునకు వెళ్లారు. మార్గమధ్యలో ఆలూరు బస్సు స్టేజీకి సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చేవెళ్ల వైపు ఎందుకు వచ్చారు..?

మిత్రులిద్దరు దావత్ పూర్తయిన తర్వాత ధారూరు వెళ్లాల్సింది పోయి చేవెళ్ల వైపు ఎందుకొచ్చారని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వీరి వెంట మరో స్నేహితుడు ప్రదీప్‌ను మన్నెగూడలో దింపి .. మళ్లీ వెనక్కి ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో అర్థం కావడం లేదన్నారు. ప్రదీప్ మాత్రం తనకేమి తెలియదని చెబుతున్నాడు. ఈ ప్రమాదంపై తమకు అనుమానాలు ఉన్నాయని, పోలీసులు ఈ దిశగా దర్యాప్తు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఎమ్మెల్యే యాదయ్య పరామర్శ

చేవెళ్ల ఆస్పత్రిలో ఇద్దరి మృతదేహాలను ఎమ్మెల్యే కాలె యాదయ్య పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందని అడిగి తెలుసుకున్నారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

‘వంట’ మంట

ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు సకాలంలో వేతనాలు.. బిల్లులు అందక ఇబ్బంది పడుతున్నారు. అప్పులు చేసి విద్యార్థులకు వండి పెడుతుంటే మాకు పూటగడవని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెనూలు మారుస్తున్నారే తప్ప అందుకు సంబంధించిన బిల్లులు, వేతనాలు చెల్లించడంలో మాత్రం అలసత్వం వీడడం లేదని వాపోతున్నారు.

అందని వేతనాలు.. తీరని వెతలు
- లక్షల్లో పేరుకుపోయిన బకాయిలు
- ఇబ్బంది పడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు



మంచాల: మండల పరిధిలో 44 ప్రభుత్వ పాఠశాలలుండగా విద్యార్థులు లేక నాలుగు పాఠశాలలు మూతపడ్డాయి. ప్రస్తుతం 40 పాఠశాలల్లో 4,800 విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో 84 మంది మహిళలు మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరికి ప్రతీ నెల రూ.వేయి గౌరవ వేతనం, ఒక గుడ్డుకు రూ.5, ప్రాథమిక పాఠశాలకు సంబంధించి ప్రతీ విద్యార్థికి కూరగాయల ఖర్చుకు రూ.5.45, 6,7,8 తరగతుల విద్యార్థులకు ఒక్కక్కరికి రూ.8.71, 9,10 తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10.67 చెల్లించాలి. ప్రతీ సోమ, బుధ, శుక్ర వారాల్లో విద్యార్థులకు గుడ్డు ఇవ్వాలి.

లక్షల్లో బకాయిలు

మధ్యాహ్న భోజన కార్మికులు అప్పులు చేసి వడ్డించి ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు అందక ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల ప్రారంభం నుంచి నేటి వరకు తొమ్మిది నెలల కోడిగుడ్డుకు చెల్లిచాల్సిన బిల్లుల్లో నాలుగు నెలల బిల్లులు ఇటీవలే ఇచ్చారు. మిగిలిన ఐదు నెలలకు సంబంధించిన గుడ్డు బిల్లులు సుమారు రూ.4.25లక్షలు, కూరగాయాలకు సంబంధించి రూ.2.75లక్షలు, మూడు నెలల గౌరవ వేతనాలు రూ.2.55లక్షలు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులను అడిగితే బిల్లులు చేసి పంపిపాం. ఎస్టీఓలో ఫ్రీజింగ్‌లో పెట్టారని సమాధానం ఇస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ ఇబ్బందులను గుర్తించి వెంటనే బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటి నుంచైనా ప్రతీ నెల సకాలంలో బిల్లులు అందించాలని కోరుతున్నారు.

సకాలంలో అందించాలి

మధ్యహ్న భోజనం బిల్లులు సకాలంలో రావడం లేదు. డబ్బులు అందక నానా అవస్థలు పడుతున్నాం. ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం సకాలంలో బిల్లులు అందించాలి.

– గ్యార అండాలు, మంచాల

అప్పల పాలవుతున్నాం

ప్రభుత్వం మధ్యహ్న భోజనం బిల్లులు నెల వారీగా అందించక పోవడంతో అప్పుల పాలవుతున్నాం. ఇప్పటికి నాలుగు నెలలకు సంబంధించిన గ్రుడ్ల బిల్లులు, మూడు నెలలకు సంబంధించి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి.

– గ్యార భారతమ్మ, మంచాల

బిల్లులు పంపించాం

మధ్యాహ్న భోజన బిల్లులు ఆగిపోయాయి. మేము బిల్లులు చేసి పంపించాం. ట్రెజరీలో ఫ్రీజింగ్‌లో ఉంచారు. కొన్ని బిల్లులు పైస్థాయి నుంచే రాలేదు. త్వరలోనే అందరికీ బిల్లులు అందుతాయి.

– వెంకట్‌రెడ్డి, ఎంఈఓ

బాలుర వసతి గృహం తనిఖీ


విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న డీటీడీవో కేతు రామేశ్వరిదేవి

కడ్తాల్: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని మంగళవారం సాయంత్రం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి (డీటీడీవో) కేతు రామేశ్వరి దేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అడిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యసనను పరిశీలించారు. ప్రభుత్వం అందజేస్తున్న కాస్మాటిక్స్, నోట్‌బుక్స్, దుప్పట్లు, బ్లాంకెట్స్ అందుతున్నాయా, మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా అని ఆరా తీశారు. క్రమశిక్షణతో చదివి ఉత్తమంగా రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా దృష్టి సారించాలని వసతి గృహ సంక్షేమ అధికారికి సూచించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి రాములు, వసతి గృహ సిబ్బంది ఉన్నారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి


మృతుడు కృష్ణ(ఫైల్)

మణికొండ: ఓ నిర్మాణ సంస్థలో సెల్లార్ గుంత తీసేందుకు క్రషింగ్ చేస్తున్న వ్యక్తి తలపై ప్రమాదవశాత్తు రాయి పడటంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నార్సింగి ఎస్సై మురళి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నార్సింగిలో ఓ నిర్మాణ సంస్థ అపార్ట్‌మెంట్ నిర్మాణపనుల్లో భాగంగా 40 అడుగుల లోతులో సెల్లార్ తీస్తోంది. ఈ సందర్భంగా తొలగించిన రాళ్లను పక్కనే కుప్పగా పోశారు. మంగళవారం వాటి పక్కనే ట్రాక్టర్‌తో క్రషింగ్ పనిచేస్తున్న కృష్ణ (35) తలపై ఓ పెద్ద పడటంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నల్గొండ జిల్లా చిట్యాల మండలం, పెద్దకాపర్తి గ్రామానికి చెందిన వాడని అతని బంధువులు తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని అతని బంధువులు సంఘటనా స్థలంలో ఆందోళనకు దిగారు. సంఘటనా స్థలానికి చేరుకున్న నార్సింగి పోలీసులు వారిని సముదాయించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఒడిశా వలస కార్మికులకు విముక్తి

45 మంది కార్మికులు 19 మంది పిల్లలను స్వస్థలానికి పంపిన అధికారులు


ఇటుక బట్టీలో పని చేస్తున్న వలస కార్మికులకు విముక్తి కల్పించిన అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఒడిశా కార్మికులకు అధికారులు విముక్తి కల్పించారు. ‘సార్ ఇక్కడ మేం పని చేయలేం.. మా ఊరికి వెళ్లిపోతాం’అని చెప్పడంతో మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ సమీపంలో ఉన్న బీబీఆర్ ఇటుక బట్టీ వద్దకు కార్మిక శాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖ, పోలీస్ శాఖ అధికారులు చేరుకున్నారు. యజమానితో మాట్లాడి 45 మంది కార్మికులు,19 మంది పది సంవత్సరాల లోపు పిల్లలకు విముక్తి కల్పించారు. వీరందరిని ఒడిశా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలించేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ లెబర్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారి ప్రవీణ్, బాల సంరక్షణ శాఖ అధికారి సుశీల, నరేష్, అసిస్టెంట్ లెబర్ అధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై పోలీసులు, విద్యార్థులకు అవగాహన


సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు

అబ్దుల్లాపూర్‌మెట్: గుండె పోటు, పాము కాటు, ఫిట్స్, కార్డియాక్ అరెస్ట్ వంటి ప్రమాదాలు చోటుచేసుకున్న అత్యవసర పరిస్థితుల్లో ఎలాంటి సహాయం చేయాలన్న అంశాలపై పోలీసులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈఎంఆర్ఐ ఎండీ డాక్టర్ జీవి రమణారావు ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పిగ్లీపూర్‌లోని ఎస్ఎల్‌సీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ఎలా చేయాలో ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో ఎస్ఐ మన్మథ కుమార్, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

హైదరాబాద్ చేరుకున్న ఉమ్రా యాత్రికులు



శంషాబాద్: ఉమ్రా యాత్ర పూర్తి చేసుకున్న యాత్రికులు మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషా బాద్ విమానాశ్రయలో వారి కుటుంబసభ్యులు, బంధువుల, స్నేహితులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్చాలు అందజేసి సన్మానించారు. ఇరవై రోజుల క్రితం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన మొత్తం 80 యాత్రికులు ఉమ్రా యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకున్నట్లు నిర్వాహకులు ఫయాజ్ అలీ తెలిపారు

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FARM LAND FOR SALE
■ SVT ఫాంల్యాండ్స్ & డెవలపర్స్ కేవలం 15లక్షలకే 1/2 అరఎకరము శ్రీగంధం మొక్కలతో మరియు 5సం॥లలో 10లక్షలు బై బ్యాంక్ అగ్రిమెంట్, ఇది కేవలం మొదటి 50 మందికి మాత్రమే, త్వరపడండి, ఫోన్ : 9177619716 [HA-1045]

PLOT FOR SALE
■ 0% ఇంట్రెస్ట్‌తో 30 నెలల ఈక్వల్ EMIతో రాజాపూర్ దగ్గర అన్ని డేవలప్‌మెంట్స్‌తో 147 గజాల MUDA(HMDA) లేఔట్లో ఓపెన్ Plots కలవు. ఫ్రీ సైట్ విజిట్. Ph: 9949695027 [HA-1022]

TO-LET
■ విజయవాడ బందర్ రోడ్డుపై గవర్నర్ పేటలో బీసెంట్‌రోడ్ దగ్గర గోల్డ్ మరియు జ్యువల్లర్ షాప్‌కి పనికివచ్చు సెల్లార్‌తో కలిపి 25,200 చదరపు అడు గులు ఉన్నటువంటి కమర్షియల్ బిల్డింగ్ అద్దెకు ఇవ్వబడును. ✆ 95422 86999 [B-1201951]

■ 2Bedroom Flat behind Crescent Hospital in Humayun Nagar Nr. Ratnadeep Stores Available rent. Rent to be Paid by Post Dated Cheques Call: 8897139200. [H-793618]

■ Financial District, Fully Furnished office space. 25k Sft. each. 2 Floor. Rented to Software Company. A grade building Agents wellcome Cell: 9966557533 [H-793330]

Services

BUSINESS SERVICE
■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మరియు ఏ ఇతర ఫైనాన్స్ లో ఉన్నా మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ఫోన్ : 9494995999 [H-787442]

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-792829]

BUSINESS OFFER
■ ఇంటినుండి 100 రకాల ఉత్పత్తులతో రోజు సంపాదన. LED's, TV's, AC's Mobiles కొత్తవి కొన/అమ్మబడును. EMI, Credit Cardలో బ్యాలెన్స్ ఉన్నవారికి Spot పర్సనల్/బిజినెస్ లోన్స్ ఫైనాన్స్ సౌకర్యం. ఫోన్ : 9100729447. [HA-2991]

HOME NEEDS

HEALTH CARE
■ మీరు చాలా సంవత్సరాల నుండి BP/ Sugar, కిడ్నీ సమస్యలు, నరాల బలహీనత, కీళ్లనొప్పులు, మోకాళ్ళ నొప్పులు, డయాలసిస్ లాంటి సమస్యలతో బాధపడుతున్నారా? ఈ సమస్యలన్నింటికి మందులు వాడకుండా నయం కావాలనుకుంటున్నారా? సంప్ర: 6301728778 [H-793574]

CHANGE OF NAME
■ I, Bairagoni UmaRani W/o Chittula Devender, Res Hno:1-10-4/12, opp Bus stop Kushaiguda, ECIL Post, Hyd-500062, T.S. After My Marriage Changed My Name As CHITTULA VANI. [H-796812]

■ I, NELLUTLA VIJAY R/o, H.NO:- 16-11-405/98, SBI officers colony, moosarambagh, HYD, T.S. changed my name Nellutla Vijay To Nellutla Vijay Kumar S/o. Nellutla Srinivas Rao. [H-796867]

■ I, Abeda Begum W/o Mohammed Sharfuddin R/o.H.No.15-222/4/A, Al Jabari Colony, Balapur, K V Ranga Reddy, Hyderabad - 500005, T.S. have changed my name from Syed Abeda Unissa to Abeda Begum for all records purposes. [HA-92406]

TOURS & TRAVELS
■ గంగాపుష్కరాలు: 27-4-23, కాశీ, ముక్తినాథ్, ప్రయాగా, నేపాల్. రో.15, A/C రైలు, బస్సు, భో, వ.కర్ణాటక యాత్ర: 10-3-23. రో.8, భో.వ. బస్సు. భాగ్యలక్ష్మిటూర్స్. ఫోన్: 9397617094 [HA-92339]

Wanted
■ అక్షయ్ రెస్టారెంట్ @ సికింద్రాబాద్ నందు పనిచేయుటకు వెజ్/నాన్ వెజ్ మాస్టర్ & టీ మాస్టర్, జూస్ మాస్టర్ కావలెను. సంప్ర: 9000877008/ 9000611009 [H-792942]

■ అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్ కాషాయ్‌నగర్, అఫ్జల్‌గంజ్, కాళీ మందిర్, నాంపల్లి, చార్మినార్, LB నగర్, వనస్థలిపురం, అమీన్‌పూర్, పటాన్‌చెరు, మణికొండ, బాలాపూర్. రూం+Food+ 10K-15K. Ph: 7702770830 [HA-10341]

■ అర్జెంటుగా కావలెను కార్పెంటర్, వెల్డర్, ఎలక్ట్రీషన్, DCM డ్రైవర్, 3D Designer మిలీనియం ఈవెంట్స్ మరియు ట్రేడ్ ఫేర్స్. కీసరగుట్ట, హైదరాబాద్. Ph: 9963635193. [HA-28928]

■ ప్రహాస్య బేబీకేర్ పిల్లలను చూడటానికి, పెద్దలకు సేవ చేయటానికి మహిళలు కావలెను. 12 Hrs or 24 Hrs, హైదరాబాద్. ఫోన్ : 9533909627, 8125784389. [H-787377]

■ ప్రముఖ కొరియర్ సంస్థ World First నందు చందానగర్ కొండాపూర్, అమీర్‌పేట్, కూకట్‌పల్లి బ్రాంచిలో పనిచేయుటకు పరిసర ప్రాంతాల పికప్ & డెలివరి బాయ్స్ కావలెను. 7799994504, 7799994502 [H-796809]

■ ఇంటర్ BiPC ట్యూషన్ టీచర్స్ లెక్చరర్స్, BE, B.Tech., M.Tech., MBBS, MBA (పాస్/ఫేల్), టీకా. DTP డాటా ఎంట్రీ, రిపోర్టర్లు, యాంకర్లు, ఆర్టిస్ట్స్, సూ॥వై॥ హెల్పర్స్, డ్రైవర్లు జీ. 10-25K+ ఫ్రీ హాస్టల్ @ 9505261777. [H-792940]

■ ప్రముఖ టాక్సీ కంపెనీలో వెంటనే చేరండి. హైదరాబాద్ అంతటా పని చేయుటకు కావలెను. ఆటోమెటిక్ కార్ ప్రాబ్లమ్ ఉండదు. జీతం: 17,600 – 20,000 P/M + కుటుంబానికి ప్రైవేట్ ఇన్సూరెన్స్ + పిల్లల చదువు కోసం చేయూత ఉంటుంది. సంప్ర: 040–49170007. [QA-1732]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781904]

■ వర్క్ ఫ్రం హోమ్ మీ లోకల్ న్యూస్ యాప్ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్, యాడ్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, మేనేజర్ కావలెను. సెల్ : 99666 76646 మెహిదీ పట్నం, రేతి బౌలి. [L-794264]

■ ప్రముఖ మ్యారేజ్ బ్యూరో కొరకు బాగా మాట్లాడగల (లేడీ) టెలికాలర్స్ అర్జెంట్‌గా కావలెను. Qly: 10th-PG, Age: 18yr-35yr జీతం+కమిషన్ సికింద్రాబాద్ సంప్ర: 7386550413 [H-793374]

■ అన్నపూర్ణ హోమ్ కేర్ Govt Reg:లో బేబీ కేర్, పేషెంట్ కేర్, కేర్ టేకర్స్ స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000/- 30000/- రూమ్ + భోజన సౌకర్యం కలదు. Ph: 9390427694 [H-778973]

■ CM హోమ్‌కేర్ సర్వీస్: బేబీకేర్, ఇంటి, వంట, పేషెంట్స్ చూసుకోవడానికి కేర్ టేకర్స్, ఇంటికి పంపబడును. 20–50y స్త్రీ/పు, 24/7 మా వద్దనే ఉండి లాంగ్ టైమ్ డైపర్ వర్కర్స్ కావలెను. జీ: 16-20K. 6309807798, 9121099519 [H-793331]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు), ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక : జిల్లాపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453